ఖమ్మం, ప్రతినిధి అక్టోబర్ 17 (భద్రాద్రిన్యూస్): ఆడబిడ్డల ఆత్మగౌరవ ప్రతీకగా, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా యూనియన్ కార్యాలయంలో ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గౌరీదేవికి పూజలు నిర్వహించారు. ముందుగా పసుపు, కుంకుమ, వివిధ రకాల రంగురంగుల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి, దీపారాధన చేశారు. వెన్న ముద్దల బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. మహిళా ఉద్యోగులు తమ ఇళ్లలో సంప్రదాయబద్ధంగా పేర్చిన బతుకమ్మలను యూనియన్ కార్యాలయానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. పూలతో అందంగా పేర్చిన భారీ బతుకమ్మలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ, నృత్యాలతో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా సంబురాల్లో పాల్గొన్నారు. జానపద గీతాలు, పూల పరిమళాలు, ఆటపాటలతో యూనియన్ కార్యాలయం పండుగ శోభను సంతరించుకుంది. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడంతో కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో కోలాహలంగా సాగింది. వెజిటేబుల్ మార్కెట్ మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిసింది. వేడుకల ప్రారంభ సమయంలో ప్రకృతి దీవెనన్నట్లుగా చిరుజల్లులు పులకరింపజేశాయి. వేడుకలకు హాజరైన వారికి నిర్వాహకులు అల్పాహార ఏర్పాట్లు చేశారు.

బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో అనుబంధానికి ప్రతీక: గుంటుపల్లి శ్రీనివాసరావు

టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, టీజీఈ జేఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి, ప్రకృతితో మనకున్న విడదీయలేని అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ పండుగ మన ప్రాంత ప్రత్యేకతను, పల్లె జీవన వైభవాన్ని, పూలతో ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందని అన్నారు. పూలను పూజిస్తూ గౌరీదేవిని ఆరాధించడం ద్వారా ప్రకృతి పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేయడమే కాకుండా, కుటుంబాల్లో సుఖసంతోషాలు, సమాజంలో ఐక్యత, ప్రజల జీవితాల్లో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని మహిళలు ఆకాంక్షిస్తారని తెలిపారు. ఎనిమిదో రోజు వెన్న ముద్దల బతుకమ్మను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం తెలంగాణ సంప్రదాయాల్లో విశిష్టమైన భాగమని, ఈ సందర్భంగా మహిళలు పసుపు, కుంకుమ, పుష్పాలతో గౌరీదేవిని పూజించి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడం మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలకు నిదర్శనమని అన్నారు. ఆధునిక జీవనశైలిలో ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో నిరంతరం బిజీగా ఉండే మహిళా ఉద్యోగులు ఇలాంటి పండుగల ద్వారా తమ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు, సహోద్యోగులతో ఆత్మీయంగా గడపడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారిక బతుకమ్మ సంబురాల్లో భాగంగా టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తూనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు టీఎన్జీవోస్ యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని, పరస్పర సహకారాన్ని పెంపొందించడంతో పాటు మహిళా ఉద్యోగుల్లో నూతనోత్సాహాన్ని నింపుతాయని అన్నారు. మహిళా ఉద్యోగుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి సంక్షేమానికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టడంలో యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మన పండుగల విశిష్టతను యువతకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, పాడిపంటల సమృద్ధిని తీసుకురావాలని, మహిళలందరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఉద్యోగుల ఐక్యతకు సాంస్కృతిక వేదికలు దోహదం: కొణిదెన శ్రీనివాస్

టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు, సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంప్రదాయాల పట్ల ఉన్న మమకారాన్ని చాటడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారిలో సోదరభావం, ఆత్మీయతను పెంపొందించేందుకు యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి ఏటా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా నాయకులు, ఉద్యోగులు, మహిళా విభాగం సమన్వయంతో కార్యక్రమం విజయవంతమైందని చెప్పారు. ఇలాంటి వేడుకలు ఉద్యోగుల మధ్య స్నేహసంబంధాలను బలోపేతం చేస్తాయని అన్నారు.

మహిళా ఉద్యోగుల్లో నూతనోత్సాహం నింపిన బతుకమ్మ: జి.మృదుల

టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా మహిళా విభాగం కన్వీనర్ జి.మృదుల మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగ, కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహించే మహిళలకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని, నూతనోత్సాహాన్ని అందిస్తాయని తెలిపారు. మహిళా ఉద్యోగులంతా ఐక్యతతో ముందుకు సాగుతూ ప్రతి రంగంలో తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఆత్మీయతను, ఐక్యతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. వేడుకల నిర్వహణకు సహకరించిన యూనియన్ నాయకులు, ఉద్యోగులు, మహిళా ప్రతినిధులు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఉత్సాహపరితంగా కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో,. టీజీవోస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, అసోసియేటెడ్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, టీఎన్జీవోస్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్.ఎస్. జైపాల్, జిల్లా కోశాధికారి వల్లపు వెంకన్న, అసోసియేట్ అధ్యక్షుడు కొమరగిరి దుర్గాప్రసాద్, శేషు ప్రసాద్, టీఎన్జీవోస్ ఉపాధ్యక్షులు ఎర్ర రమేష్, శ్రీధర్ సింగ్, అస్లాం ఖాన్, జాయింట్ సెక్రటరీలు తాళ్లూరి శ్రీకాంత్, భూస చంద్రశేఖర్, హరికృష్ణ కోణార్, పెద్దినేని రాధాకృష్ణ, నగర అధ్యక్షులు బెజ్జంకి ప్రభాకరాచారి, డ్రైవర్ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి వెంకటరమణ,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, మహిళా ఉద్యోగ ప్రతినిధులు లలిత కుమారి, రాధికా రెడ్డి, ఎన్. విజయ, కోమలి, సుబ్బమ్మ, టీఎన్జీవోస్ నాయకులు గుర్రం శ్రీనివాసరావు, మెట్టు వీరయ్య, ప్రసాద్, విజయ్, సైదులు,ఏ.సుధాకర్, బుర్రి వెంకటేశ్వర్లు, బుర్రి నాగేశ్వరరావు, రవి, అంజమ్మ, నరేందర్, రమేష్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డితో మంత్రి తుమ్మల కీలక భేటీ

- రైతు భూమికి భరోసా.. పంటకు రక్షణ
- సీతారామ కాలువలకు పైపులు..
- ఆయిల్‌పామ్ తోటల్లో కవర్డ్ కండక్టర్లు
- సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు
- 9,767 ఎకరాల భూమి ఆదా.. భూసేకరణ వ్యయంలో రూ.2,148.74 కోట్ల తగ్గింపునకు అవకాశం

హైదరాబాద్, అక్టోబరు 17(భద్రాద్రిన్యూస్): రైతుల భూమిని కాపాడటం.. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని తగ్గించడం.. ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాలను నివారించడం.. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి జలాలను నిల్వ చేసుకోవడం.. ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు సాధించడం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అక్టోబరు 16న రెండు వేర్వేరు లేఖలు అందజేశారు. సీతారామ ఎత్తిపోతల పథకం పంపిణీ కాలువలను సాంకేతికంగా సాధ్యమైన చోట పైపుల వ్యవస్థగా మార్చాలని ఒక లేఖలో కోరగా.. ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు లైన్లను కవర్డ్ కండక్టర్లుగా మార్చేందుకు రాష్ట్రస్థాయి ఉమ్మడి విధానం రూపొందించాలని మరో లేఖలో ప్రతిపాదించారు. అలాగే, దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆమోదించిన కాలువల వ్యవస్థతో పోలిస్తే పైపుల ద్వారా నీటిని పంపిణీ చేయడం వల్ల భూసేకరణ అవసరాన్ని గణనీయంగా తగ్గించవచ్చని మంత్రి వివరించారు. దీనివల్ల సుమారు 9,767 ఎకరాల భూమి ఆదా కావడంతో పాటు భూసేకరణ వ్యయంలో రూ.2,148.74 కోట్ల వరకు తగ్గింపు సాధ్యమవుతుందని అంచనా వేశారు. మరోవైపు ఆయిల్‌పామ్ తోటల్లో చెట్ల ఆకులు విద్యుత్తు తీగలకు తగలడం వల్ల ఏర్పడుతున్న సరఫరా అంతరాయాలు, ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వకు తక్షణ చర్యలు

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఇసుక బస్తాలతో తాత్కాలికంగా నీటిని నిల్వ చేసే ప్రతిపాదనను మంత్రి తుమ్మల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆనకట్టపై సుమారు ఒక మీటరు నుంచి మీటరున్నర ఎత్తు వరకు ఇసుక బస్తాలను ఏర్పాటు చేయడం ద్వారా సుమారు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసే అవకాశం ఉందని వివరించారు. దీనివల్ల ప్రస్తుతం గోదావరిలో ప్రవహిస్తున్న నీటిని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకోవచ్చని, మూడు జిల్లాలకు తాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఇసుక బస్తాలను ఏర్పాటు చేయవచ్చని, బస్తాల స్థాయి వరకు నీరు చేరిన తర్వాత కూడా ప్రవాహం కొనసాగితే అదనపు నీరు వాటిపై నుంచి ప్రవహించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రికి వివరించగా, పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఖమ్మంకు వరాలు కోరిన తుమ్మల

ఖమ్మం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను మంజూరు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ముఖ్యంగా ఖమ్మం నగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) ఆమోదించి, అవసరమైన నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబరు 9న కల్లూరిగూడెం ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని, ఖమ్మంలో వెలుగుమట్ల హౌసింగ్ మోడల్ కాలనీని ప్రారంభించేందుకు రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. ఖమ్మం నియోజకవర్గ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలను త్వరగా పరిష్కరించి, అర్హులకు స్థలాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

6.74 లక్షల ఎకరాలకు సాగునీటి లక్ష్యం

సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, ఖమ్మం నియోజకవర్గాల్లో 3,28,853 ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరో 3,45,534 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రతిపాదించారు. మొత్తంగా 6,74,387 ఎకరాలకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకంలో పంపిణీ కాలువల నిర్మాణానికి అవసరమయ్యే భూసేకరణ ప్రధాన సమస్యగా మారుతోందని తుమ్మల తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమోదించిన పంపిణీ కాలువల నిర్మాణానికి సుమారు 11,162 ఎకరాల భూమి అవసరమవుతుందని అంచనా. ఎకరాకు సగటున రూ.22 లక్షల చొప్పున లెక్కిస్తే భూసేకరణకే దాదాపు రూ.2,455 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆయిల్‌పామ్ వంటి అధిక పెట్టుబడి అవసరమయ్యే పంటలు సాగు చేస్తున్న రైతుల భూములను సేకరించడం మరింత కష్టంగా మారుతోందని వివరించారు. అటవీ ప్రాంతాల్లో అటవీ హక్కుల చట్టం (ఆర్వోఎఫ్ఆర్), పరిహార అడవుల పెంపకానికి సంబంధించిన నిబంధనలు కూడా సవాళ్లుగా ఉన్నాయని పేర్కొన్నారు.

పైపుల వ్యవస్థతో భారీగా భూమి ఆదా

తెరిచిన కాలువలు, గురుత్వాకర్షణ ఆధారిత కాలువల స్థానంలో సాంకేతికంగా అనుకూలమైన చోట పైపుల ద్వారా నీటిని సరఫరా చేసే వ్యవస్థను అమలు చేయాలని మంత్రి ప్రతిపాదించారు. ఈ విధానం ద్వారా భూమి అవసరాన్ని 11,162 ఎకరాల నుంచి 1,395 ఎకరాలకు తగ్గించవచ్చని అంచనా. ఫలితంగా సుమారు 9,767 ఎకరాల భూమి రైతులకు అందుబాటులో ఉండటంతో పాటు భూసేకరణ వ్యయంలో రూ.2,148.74 కోట్ల మేర ఆదా సాధ్యమవుతుందని వివరించారు. నీటిపారుదల శాఖ 157వ సాంకేతిక సలహా కమిటీ కూడా సాధ్యమైన ప్రాంతాల్లో పైపుల ఆధారిత పంపిణీ వ్యవస్థను చేపట్టాలని సూచించిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. భూసేకరణ అవసరం తగ్గితే రైతుల నుంచి అభ్యంతరాలు తగ్గడంతో పాటు భూముల సేకరణ ప్రక్రియ సులభతరమవుతుందని పేర్కొన్నారు. అటవీ భూములు, పరిహార అడవుల పెంపకానికి సంబంధించిన సమస్యలను కూడా కొంతవరకు అధిగమించవచ్చని తెలిపారు.

నిర్మాణ వ్యయాల తగ్గింపునకూ అవకాశం

పైపుల వ్యవస్థను అమలు చేయడం వల్ల భూసేకరణతో పాటు కాలువల నిర్మాణానికి సంబంధించిన పలు పనుల్లోనూ వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉందని తుమ్మల పేర్కొన్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం మట్టి పనులకు రూ.413.59 కోట్లు, సీసీ లైనింగ్‌కు రూ.523.02 కోట్లు, క్రాస్ డ్రైనేజీ తదితర సీఎండ్‌సీడీ పనులకు రూ.1,078 కోట్లు అవసరమవుతున్నాయని వివరించారు. ఈ నిర్మాణ విభాగాల్లో మార్పుల ద్వారా సుమారు రూ.1,807.82 కోట్ల వరకు ఆదా చేసే అవకాశం ఉందని ప్రతిపాదనలో పేర్కొన్నారు. పైపుల ద్వారా నీటిని సరఫరా చేస్తే నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయవచ్చని, ధరల పెరుగుదల కారణంగా ప్రాజెక్టు వ్యయం మరింత పెరగకుండా నియంత్రించవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. నీటి వృథాను తగ్గించడంతో పాటు విద్యుత్తు వినియోగాన్ని కూడా ఆదా చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సాగునీటి సరఫరా మరింత సమర్థంగా మారితే రైతులు వరి వంటి పంటలతో పాటు అధిక లాభాలు అందించే వాణిజ్య పంటల సాగువైపు మళ్లేందుకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల్లో తీగలతో ఇబ్బందులు

రాష్ట్రంలో అధిక విలువ కలిగిన ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ఆయిల్‌పామ్ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులతో పాటు కొత్తగా తోటలు ఏర్పాటు చేయాలనుకునేవారికి విద్యుత్తు లైన్ల సమస్యగా మారుతున్నాయని తుమ్మల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయిల్‌పామ్ చెట్లు ఎత్తుగా పెరిగిన తర్వాత వాటి ఆకులు, కొమ్మలు బేర్ కండక్టర్లను తాకుతున్నాయి. దీంతో తరచూ విద్యుత్తు లైన్లు ట్రిప్ అవుతున్నాయని, సంబంధిత ఫీడర్లపై ఆధారపడిన రైతుల పంపుసెట్లతో పాటు ఇతర వినియోగదారులకూ విద్యుత్తు సరఫరా నిలిచిపోతోందని వివరించారు. తీగలు తగలడం వల్ల విద్యుత్తు షాక్‌లు, అగ్నిప్రమాదాల ముప్పు ఏర్పడుతోందని, రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల భద్రతకు ప్రమాదం పొంచి ఉంటోందని పేర్కొన్నారు. చెట్ల కొమ్మలను తరచూ తొలగించాల్సి రావడంతో విద్యుత్తు పంపిణీ సంస్థలపై నిర్వహణ భారం, పునరావృత వ్యయం పెరుగుతున్నాయని తెలిపారు. ఈ సమస్యపై రైతుల నుంచి ఫిర్యాదులు ఎక్కువవుతున్నాయని, విద్యుత్తు లైన్ల సమస్య ఆయిల్‌పామ్ సాగు విస్తరణపైనా ప్రభావం చూపుతోందని వివరించారు.

11 కేవీ లైన్లకు కవర్డ్ కండక్టర్లు

ఆయిల్‌పామ్ తోటల్లోని 11 కేవీ బేర్ కండక్టర్ల స్థానంలో కవర్డ్ కండక్టర్లు ఏర్పాటు చేయాలని తుమ్మల ప్రతిపాదించారు. అవసరమైన ప్రాంతాల్లో తక్కువ వోల్టేజీ (ఎల్‌టీ) లైన్లకు ఏరియల్ బంచ్‌డ్ కేబుళ్లు వినియోగించాలని సూచించారు. దీనివల్ల చెట్ల ఆకులు, కొమ్మలు తీగలను తాకడం వల్ల ఏర్పడే సమస్యలను తగ్గించడంతో పాటు విద్యుత్తు సరఫరా విశ్వసనీయతను మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. ఈ మార్పులను విడివిడిగా కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధానంతో చేపట్టాలని కోరారు. ఉద్యాన శాఖ, ఇంధన శాఖ, తెలంగాణ ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్), తెలంగాణ దక్షిణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) సమన్వయంతో పనిచేసేలా విధానం రూపొందించాలని సూచించారు.

కొత్త తోటల అనుమతితోనే ప్రక్రియ ప్రారంభం

కొత్తగా ఆయిల్‌పామ్ లేదా ఇతర తోటల సాగుకు అనుమతి ఇచ్చే సమయంలోనే సంబంధిత పొలంలో ఉన్న విద్యుత్తు లైన్ల మార్పిడి అవసరాన్ని గుర్తించాలని మంత్రి ప్రతిపాదించారు. ఉద్యాన శాఖ వెబ్ పోర్టల్ ద్వారా వివరాలను సంబంధిత డిస్కంకు పంపాలి. డిస్కం క్షేత్రస్థాయిలో పరిశీలించి, తోట పరిధిలోని అవసరమైన లైన్లకే పరిమితమై అంచనాలు సిద్ధం చేయాలి. ఇప్పటికే మంచి స్థితిలో ఉన్న విద్యుత్తు స్తంభాలు, ఇతర నిర్మాణాలను వినియోగించుకోవడం ద్వారా వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. అంచనాలను అదే పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, తోటకు మంజూరయ్యే బడ్జెట్‌లో లైన్ల మార్పిడి వ్యయాన్ని చేర్చాలని ప్రతిపాదించారు. ఈ విధానం అమలైతే కొత్తగా ఏర్పాటు చేసే తోటల్లోనే విద్యుత్తు లైన్ల మార్పిడి ప్రక్రియను ముందుగానే చేపట్టే అవకాశం ఉంటుంది. దీనివల్ల రైతులు తోటలు వేసిన తర్వాత ఎదుర్కొనే ఇబ్బందులను నివారించవచ్చని పేర్కొన్నారు.

పాత తోటల్లో దశలవారీగా మార్పులు

ఇప్పటికే సాగులో ఉన్న ఆయిల్‌పామ్ తోటల్లోనూ విద్యుత్తు లైన్ల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తుమ్మల సూచించారు. ఉద్యాన శాఖ, విద్యుత్తు పంపిణీ సంస్థలు సంయుక్తంగా సర్వే నిర్వహించి, అవసరమైన మార్పులను గుర్తించాలి. అనంతరం వ్యయ అంచనాలను రూపొందించి, అనుమతుల కోసం పంపి, కాలపరిమితితో దశలవారీగా పనులు చేపట్టాలని ప్రతిపాదించారు.

కొత్త తోటలకు అనుమతుల సమయంలోనే లైన్ల మార్పిడిని ప్రణాళికలో చేర్చడం, పాత తోటల్లో ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టడం ద్వారా సమస్యను క్రమబద్ధంగా పరిష్కరించవచ్చని వివరించారు. అనవసరమైన ఛార్జీలు లేకుండా, ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను సాధ్యమైనంతవరకు వినియోగించుకుంటూ కనీస వ్యయంతో పనులు పూర్తిచేయాలని సూచించారు.

రైతు సంక్షేమం.. ప్రజాధనానికి పొదుపు

సీతారామ ప్రాజెక్టులో పైపుల ఆధారిత పంపిణీ వ్యవస్థ, ఆయిల్‌పామ్ తోటల్లో కవర్డ్ కండక్టర్ల ఏర్పాటు, దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ, ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి పనులు.. ఈ ప్రతిపాదనలన్నింటి వెనుక ప్రజాప్రయోజనాలే ప్రధానంగా ఉన్నాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రైతుల భూమిని అనవసరంగా సేకరించాల్సిన పరిస్థితిని తగ్గించడం, సాగునీటి పనులను వేగవంతం చేయడం, విద్యుత్తు ప్రమాదాలను నివారించడం, అందుబాటులో ఉన్న జలాలను సమర్థంగా వినియోగించడం, ప్రభుత్వ నిధులను పొదుపు చేయడం లక్ష్యమని వివరించారు.



ఈ ప్రతిపాదనలు అమలైతే సీతారామ ప్రాజెక్టులో భూసేకరణ సమస్యలు తగ్గడంతో పాటు సాగునీటి సరఫరా మెరుగుపడే అవకాశం ఉంటుంది. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ ద్వారా మూడు జిల్లాల తాగునీటి అవసరాలకు ప్రయోజనం చేకూరవచ్చు. మరోవైపు ఆయిల్‌పామ్ సాగుదారులకు విద్యుత్తు సరఫరా అంతరాయాలు, ప్రమాదాల ముప్పు తగ్గడంతో పాటు ఖమ్మం నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

యాతాలకుంట కుంట టన్నెల్ పనులు త్వరగా పూర్తి చేయాలి...

యాతాలకుంట కుంట టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి సత్తుపల్లి, వేంసూరు, అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు సాగునీరు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ముఖ్యమంత్రిని కోరారు. ఈ ప్రాంతాల రైతులకు సాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు.

సీతమ్మసాగర్ అనుమతులు, జూలూరుపాడు టన్నెల్ పనులను వేగవంతం చేయాలి... సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేలా చర్యలు తీసుకుని, ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని మంత్రి తుమ్మల కోరారు. అదేవిధంగా జూలూరుపాడు టన్నెల్ పనులను కూడా వీలైనంత త్వరగా ప్రారంభించి, సంబంధిత సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో గుంపెన..

- అస్తవ్యస్తంగా పల్లె ప్రకృతి వనం, స్మశానవాటికలు!

- పంచాయతీ పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

- నిధులు దుర్వినియోగమవుతున్నా నిమ్మకు నీరెత్తిన వైనం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్):

అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని గుంపెన పంచాయతీలో అభివృద్ధి జాడ కరువైంది. గ్రామ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే ప్రభుత్వ ఆశయం క్షేత్రస్థాయిలో నీరుగారిపోతోంది. పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ షెడ్లు, స్మశానవాటికల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రజాధనం దుర్వినియోగమవుతున్నా సంబంధిత అధికారులు, పంచాయతీ పాలకవర్గం పట్టించుకోకపోవడంపై గ్రామస్తుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పల్లె ప్రకృతి వనం

గ్రామస్తులకు ప్రశాంత వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ప్రస్తుతం సంరక్షణ లేక అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. గతంలో మొక్కల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నత అధికారులు ఎప్పుడో ఒకసారి నామమాత్రపు తనిఖీలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. దీనికి తోడు రాత్రి సమయాల్లో ఈ ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారుతోందని, ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా డంపింగ్ షెడ్.. మౌలిక వసతులు కరువైన స్మశానవాటికలు

గ్రామాల్లో చెత్త సేకరణ కోసం నిర్మించిన డంపింగ్ షెడ్లు సరైన నిర్వహణ లేక పిచ్చి గడ్డితో అధ్వాన్నంగా తయారైంది. ఇక స్మశానవాటికల పరిస్థితి మరీ అధ్వానం. వీటి అభివృద్ధిలో స్థానిక పాలకవర్గం పూర్తిగా విఫలమైందని ప్రజలు మండిపడుతున్నారు. కనీస వసతులు లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రజలు తీవ్ర నరకయాతన పడుతున్నారు.

పారిశుధ్య లోపం.. కనీసం బ్లీచింగ్ జాడ లేదు!

గ్రామంలో పారిశుధ్య పనులు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయి. మురుగునీటి కాలువలు ఎక్కడా శుభ్రం చేసిన దాఖలాలు లేవు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం వల్ల దోమలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రధాన రోడ్లకు ఇరువైపులా పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. గ్రామంలో ఎక్కడా బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. ఆశ్చర్యకరంగా ఇప్పటివరకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టిన దాఖలాలు పత్రికల్లో రాలేదని, పంచాయతీలో పారిశుధ్యం గాలికొదిలేశారనే విమర్శలున్నాయి. 'ఇంటికో మొక్క' పంపిణీ కూడా సక్రమంగా జరగలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనిపించని పంచాయతీ కార్యదర్శి.. సక్రమంగా తిరగని చెత్తబండి

గ్రామానికి వెన్నెముకగా ఉండాల్సిన పంచాయతీ సెక్రటరీ అధికారి గ్రామంలో ఉన్నా లేనట్లేనని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో కూడా స్థానికులకు తెలియని పరిస్థితి నెలకొంది. పర్యవేక్షణ లోపించడం వల్లనే సమస్యలు తిష్టవేశాయని ఆరోపిస్తున్నారు. ఇక స్వచ్ఛ సర్వేక్షణ్ పేరిట ఇస్తామన్న సేవలు నామమాత్రంగానే సాగుతున్నాయి. చెత్తబండి కేవలం వారంలో మూడు రోజులు మాత్రమే తిరుగుతోందని, మిగతా రోజుల్లో రాకపోవడంతో ప్రజలు ఇళ్లలోని చెత్తను ఎక్కడ పడవాలో తెలియక సతమతమవుతున్నారు.

చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ :

ప్రజాధనంతో నిర్మించిన వనాలు, షెడ్లు నిరుపయోగంగా మారుతున్నా పంచాయతీ యంత్రాంగంలో చలనం లేకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి, గుంపెన పంచాయతీపై ప్రత్యేక దృష్టి సారించాలని.. సమస్యలను పరిష్కరించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.









26 గ్రామ పంచాయతీల్లో సమస్యల పరిష్కారం ఎప్పుడు?

- వీధి దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై బీఆర్ఎస్ గళం

- బతుకమ్మ పండుగ వేళైనా అధికారులు స్పందించాలి.. చర్ల పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం

చర్ల, 17 అక్టోబర్: భద్రాద్రి న్యూస్ : చర్ల మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గ్రామాల్లో వీధి దీపాలు, పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, చెత్త తొలగింపు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతూ చర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు రేగా కాంతారావు, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జి మానే రామకృష్ణ, చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో-కన్వీనర్ ఐనవోలు పవన్ కుమార్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బతుకమ్మ పండుగ నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. వీధి దీపాలు వెలగకపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం, రహదారుల వెంట చెత్త పేరుకుపోవడం, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

26 గ్రామ పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వినతిపత్రాలు స్వీకరించడంతోనే బాధ్యత ముగిసినట్లు భావించకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల ఇబ్బందులను గుర్తించి పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు కనుకు భద్రం, అలవాల కృష్ణ పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి ఆర్. కొత్తగూడెంలో గొర్ల రాజబాబు, కలివేరులో ప్రసాద్, గొమ్ముగూడెంలో సంతపూరి సతీష్, లింగాపురంలో తడికల బుల్లెబ్బాయి, కిషోర్, గొంపల్లిలో రాట్నాల శ్రీరామ్మూర్తి, గోవర్ధన్, మొగళ్లపల్లిలో యడ్ల రామదాసు, సుబ్బంపేటలో ఉబ్బా చంటి, తిప్పాపురంలో కారం కన్నారావు, తేగడలో సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. చర్ల గ్రామ పంచాయతీ పరిధిలో పార్టీ సీనియర్ నాయకులు తోటపల్లి మాధవరావు, పంజా రాజు, కాకి అనిల్, గోరింట్ల వెంకటేశ్వరరావు,




తడికల బుల్లెబ్బాయి, పాసిగంటి సంతోష్, గాదంశెట్టి కిషోర్, కుకడపు సాయి, వంకాయల వినోద్ తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కారమై ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.

చెరుకూరులో వాలీబాల్ టోర్నీ హోరాహోరీ!

- విజేతగా శ్రీరామ్‌నగర్ జట్టు.. రన్నరప్‌గా చెరుకూరు జట్టు

- యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం: ANS జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్

వాజేడు , అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్): విజయదశమి పండుగ సందర్భంగా చెరుకూరు గ్రామపంచాయతీలో మహంకాళి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. అక్టోబర్ 16, 17 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో శ్రీరామ్‌నగర్ జట్టు విజేతగా నిలిచి మొదటి బహుమతిని కైవసం చేసుకోగా, చెరుకూరు జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. బయ్యారం జట్టు మూడో స్థానంలో నిలిచింది.

విజేతలకు నగదు బహుమతులు.. షీల్డులు, మెడల్స్ ప్రదానం

టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా రూ. 10,000 నగదును మహంకాళి యూత్ అందజేసింది. రెండో బహుమతిగా రూ. 5,000 నగదును ఆచీూ (ఆదివాసీ నవనిర్మాణ సేన) అందించింది. మూడో బహుమతిని కూడా ఆచీూ అందజేసింది. విజేతలకు షీల్డులు, మెడల్స్‌ను కొత్తగట్టు శ్రీనివాసరావు ప్రదానం చేశారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: ఎట్టి విద్యాసాగర్:

ఈ సందర్భంగా ఆచీూ జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు, మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. యువత తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇలాంటి క్రీడా పోటీల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. భవిష్యత్తులో గ్రామస్థాయి పోటీలతోపాటు మండల స్థాయిలోనూ వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహించేందుకు యువత ముందుకు రావాలని ఆకాంక్షించారు.





యువత ఐక్యతకు క్రీడలు వేదిక :

చెరుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామస్థులు, పెద్దలు, మహంకాళి యూత్ సభ్యులు, ఆచీూ జిల్లా, మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యత, స్నేహభావం పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.

పోలీస్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 17 (భద్రాద్రిన్యూస్):-

పోలీస్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో శనివారం పోలీస్ పరేడ్ మైదానంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకల సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆయన సతీమణి నిష్టాశర్మ గౌరమ్మకు పూజ చేసి ప్రారంభించారు. పోలీస్ కుటుంబాలు బతుకమ్మలను వివిధ రకాల పూలతో పేర్చి రంగు రంగుల బతుకమ్మలుగా సుందరంగా పేర్చారు. పెద్ద ఎత్తున బతుకమ్మలను మహిళలు తీసుకొచ్చి ఒకే చోట ఉంచి పాటలు పాడుతూ చప్పట్లను వేస్తూ, కోలాటాలు ఆడి ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా జరుపుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో రావడంతో పరేడ్ గ్రౌండ్స్ కోలాహలంగా మారింది. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీలు సుశీల్ సింగ్,నర్సయ్య, RI లు కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగుల్ మీరా పాల్గొన్నారు.




హైమాస్ట్ లైట్ ను ప్రారంభించిన సర్పంచ్ పాలకూరి రమాదేవి నర్సింహ గౌడ్...

- 3 వ వార్డు నార్కట్ పల్లి -చిట్యాల రహదారి కూడలి వద్ద...

- రాత్రి సమయంలో ప్రయాణికులకు ఇబ్బందులు దృష్ట్యా...

మునుగోడు అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్): మండల కేంద్రంలోని 3వార్డు నార్కట్ పల్లి - చిట్యాల వైపునకు వెళ్లే బ్రిడ్జి వద్ద మార్నింగ్ వాక్ చేస్తుండగా రాత్రి సమయంలో రహదారి కూడలి వద్ద ప్రయాణికులకు రాకపోకలు లైట్లు వెలగాక ప్రమాదాలు జరుగుతున్నాయి ఇబ్బందులు పడుతున్నారని అక్కడ ఉన్న జనవాసులు తెలపగ వెంటనే స్పందించిన మునుగోడు శాసనసభ్యులు శ్రీ.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శాణఖీ నిధుల నుండి రూ.1,75,000/- విలువ గల ఆరు లైట్ల తో కూడిన హైమాస్ట్ లైట్ ను మునుగోడు గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ , 3వార్డు మెంబర్ పందుల ప్రియాంక లింగస్వామి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు గ్రామ కార్యదర్శి రాజ శేఖర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి ఆరేళ్ల సైదులు,6 వార్డు మెంబర్ యాసరాని దినేష్,13 వార్డు మెంబర్ పందుల వేణుమాధవ్ గంగాధర్,స్థానిక నాయకులు, పందుల రాజేష్,సద్దల శ్రీశైలం, బీమనపల్లి కిరణ్,బండారు మల్లేష్, ఉప్పునుతుల సత్యనారాయణ,జంగిలి నాగరాజు యస్ ఆర్ వెంకటేశ్వర్లు,గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన ర్యాలీ



ఎర్రుపాలెం(అక్టోబర్ 17)(భద్రాద్రి న్యూస్): : ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరులను సంరక్షిస్తూ, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తక్కెళ్ళపాడు గ్రామం లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షించడం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై అధికారులు, నాయకులు రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ ముక్కర రామకృష్ణ రెడ్డి, పీసీసీ సభ్యులు శీలం ప్రతాప్ రెడ్డి, ఉపసర్పంచ్ కూరపాటి రమేష్, ఏఈఓ సిందూర్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పరిపాలన అధికారి రమేష్, మాజీ ఎంపీటీసీ ముక్కర చిన్న లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అయిలూరి రవీంద్ర రెడ్డి, వార్డు సభ్యులు, తలపురెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తలుపుల విజయ్ బాబు,వరుణ్ కుమార్, రైతు నాయకులు, పంచాయతీ సిబ్బంది,, సోసైటీ డైరెక్టర్లు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- కార్యదర్శులకు బి ఆర్ఎస్ నాయకు లు వినతిపత్రం



గుండాల అక్టోబర్ 17 భద్రాద్రి న్యూస్ : మండలంలో ఉన్న 11 గ్రామపంచాయతీ గ్రామాలలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలనిబి ఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. శనివారం మండల వ్యాప్తంగా ఉన్న 11 గ్రామపంచాయతీలలో సమస్యలపై మెమోరండం బీఆర్ఎస్ పార్టీ నాయకులు అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గడ్డం వీరన్న మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగ కాంతారావు ఆదేశాలతో మండల వ్యాప్తంగా సమస్యలపై మెమోరండం అందించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటినుండి మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో కనీస సౌకర్యాలు కూడా తీర్చడం లేదని అన్నారు. మండలంలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని పారిశుద్ధం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ ఏమాత్రం సరిగా లేదని అన్నారు. గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో అప్పటి శాసనసభ్యులు రేగ కాంతారావు చొరవతో గుండాల మండలానికి కోట్ల రూపాయల నిధులు తెచ్చి రహదారులను గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించామని అన్నారు ప్రస్తుత పాలకులు, ప్రస్తుత ప్రభుత్వం ప్రజా పాలనను గాలికి వదిలేసిందని అన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కనీస సౌకర్యాలను గ్రామాలలో కల్పించాలని డిమాండ్ చేశారు. దీనితోపాటు గుండాలతోపాటు సాయనపల్లి, దామరతోగు, రోల్లగడ్డ, లింగగూడెం, పంచాయితీల్లో మెమోరండం అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాటి పాపారావు, తిరుక వల్లూరి రాము, గడ్డం రమేష్, పొంబోయిన సుధాకర్ , జబ్బా గిరిబాబు, మొక్క ప్రశాంత్, గంగాధరి నాగన్న, గడ్డం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

కరువు మండలాల జాబితాలో ఏన్కూర్, కొణిజర్ల, వైరా మండలాలను చేర్చాలి: సిపిఐ(ఎం)

- వైరా నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి

- కారేపల్లి, కామేపల్లి మండలాలకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందించాలి

- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ పక్షపాతాన్ని విడనాడాలి



వైరా, అక్టోబర్ 17, (భద్రాద్రి న్యూస్):వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ సిఐ (ఎం) డివిజన్ కార్యాలయం బోడేపూడి భవన్ లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో భూక్య వీరభద్రం, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, సిపిఎం కొనిజర్ల మండల కార్యదర్శి కార్యదర్శి చెరుకుపల్లి కుటుంబరావు, లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. జిల్లా అధికార యంత్రాంగం తెలియపరిచిన మూడు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, కొనిజర్ల, ఏన్కూరు, వైరా మండలాలను కరువు జాబితాలలో చేర్చాలని, పేద బడుగు బలహీనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వెనుకబడిన ఏజెన్సీ మండలమైన ఏన్కూరుతో పాటు కొణిజర్ల, వైరా మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చి, రైతులకు నష్టపరిహారం, ఇతర కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.వైరా నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, కారేపల్లి, కామేపల్లి, ఏన్కూరు మండలాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన ప్రాంతాలకు సాగునీరు అందించకపోవడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సాగునీటి సౌకర్యాలు కల్పించినప్పుడే వ్యవసాయం అభివృద్ధి చెందడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ఏన్కూర్ మండలం మూలపోచారం పంచాయతీ పరిధిలో పోడు భూముల పై హక్కు పత్రాలు కలిగిన గిరిజన రైతులు బ్యాంకులో తీసుకున్న పంట రుణాలు వెంటనే ప్రభుత్వం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ పక్షపాతాన్ని విడనాడాలి: నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అధికార పార్టీ రాజకీయ పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తోందని వారు విమర్శించారు. అర్హులైన పేదలందరికీ ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి, ఇళ్లులేని నిరుపేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏన్కూరు మండలంలో ఆదివారం అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు విచ్చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు సంబంధిత మంత్రులు వైరా నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కూడా అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు సమస్య పరిష్కారం, సాగునీటి సౌకర్యాల కల్పన, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో పారదర్శకత, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు.

పంచాయతీల సమస్యలను పరిష్కరించాలి
– సర్పంచులు, కార్యదర్శులకు బీఆర్ఎస్ నాయకుల వినతి



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్) : బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రుద్రంపూర్, గౌతంపూర్, ధన్‌బాద్ త్రీ ఇంక్లైన్ తదితర పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా కోతులు, కుక్కల బెడదను నివారించాలని, బతుకమ్మ ఘాట్ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ధన్‌బాద్ పంచాయతీ ప్రగతి వనంలోని ధన్‌బాద్ చెరువు వద్ద ఉన్న బతుకమ్మ ఘాట్ పిచ్చి మొక్కలతో నిండిపోయిందని, ఆదివారం బతుకమ్మలు వేసేందుకు మహిళలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని నాయకులు తెలిపారు. వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని కోరుతూ సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పూల రవీందర్, మాజీ సర్పంచులు గుమ్మడి సాగర్, రాందాస్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ రవి, ఐలయ్య, ముఖేష్ పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ ఏర్పాట్లలో వివక్షత తగదు
- రుద్రంపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు ఉమ్మడి సాగర్



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్) : తెలంగాణ ఆడపడుచులు అత్యంత వైభవంగా జరుపుకునే సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్లలో సింగరేణి కొత్తగూడెం ఏరియా అధికారులు వివక్ష చూపుతున్నారని రుద్రంపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు ఉమ్మడి సాగర్ విమర్శించారు. శనివారం ఏరియా పరిధిలోని ప్రగతివనం వద్ద ఉన్న ధన్‌బాద్ చెరువు బతుకమ్మ ఘాట్లను ఆయన ఇతర నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బతుకమ్మ నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చే ధన్‌బాద్ చెరువులో ఒక ఘాట్ వద్ద మాత్రమే చెత్త తొలగించారని, రెండో ఘాట్ వద్ద ఇంకా శుభ్రత పనులు చేపట్టలేదని తెలిపారు. గతేడాది మాదిరిగా ఈసారి కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఉంటే బాగుండేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్థానిక నాయకుల సలహాలు, సూచనలు తీసుకొని రెండు ఘాట్ల వద్ద శుభ్రత పనులు పూర్తి చేయాలని, మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధన్‌బాద్ మాజీ ఉపసర్పంచ్ రవి, బావు సతీష్, పూల రవీందర్, ఐలయ్య, మంద జయరాజు, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- బతుకమ్మలను ఎత్తుకున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ





వైరా, అక్టోబర్ 17, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ దంపతులు, మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ కృష్ణ, పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం బతుకమ్మ ఆటపాటలు ఆడారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక ఈ పండుగని, ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ కు గొప్ప విశిష్టత ఉన్నదని, ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో ముడిపడి ఉన్న గొప్ప సాంస్కృతిక వేడుక అని అన్నారు పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత అని, మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలు జరుపుకోవడం మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతుందని అన్నారు. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో, సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారూ

.అనంతరం కుటుంబ సభ్యులు మహిళలతో కలిసి కోలాట నృత్యాలు చేస్తూ బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరగా బతుకమ్మలను సాగనంపే కార్యక్రమంలో పాల్గొని వేడుకలను ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, బోర్ర రాజశేఖర్, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, డాక్టర్ కాపా మురళీకృష్ణ,కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి , వీరంశెట్టి,సీతారాములు, కౌన్సిలర్ ముళ్లపటి విజయ, వేముల శ్రావణి ఉంద్రు వరలక్ష్మి, తాటిపూడి సర్పంచ్ జవాజ అశ్విన , డాక్టర్ మురళీకృష్ణ, , పణితి సైదులు, శ్యాం బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి
– భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, భూ రీ సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, కచ్చితత్వంతో విధులు నిర్వహించాలని సూచించారు. శుక్రవారం ఇల్లెందు ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్ ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు, మామిడి గుండాలలో భూ రీ సర్వే పనులు, జీఓ నం. 76 కింద సింగరేణి భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులకు సంబంధించి చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేను పరిశీలించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. నూతన ఓటరు నమోదు కోసం ఫారం-6 ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, నమోదు ప్రక్రియ పురోగతిని బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పాల్వంచ కేటీపీఎస్ కాలువలో విషాదం..

- ఇద్దరు యువకులు మృత

- కిన్నెరసాని నుంచి వచ్చే కేటీపీఎస్ కాలువలో ఈతకు దిగి గల్లంతు

-అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ స్థానికుల ఆగ్రహం

- ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డులు లేకనే వరుస మరణాలు







పాల్వంచ, అక్టోబర్17(భద్రాద్రి న్యూస్):
పాల్వంచ కే టి పి ఎస్ పవర్ ప్లాంట్ పరిధిలోని కరకవాగు వద్ద మరో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కిన్నెరసాని నుండి వచ్చే కే టి పి ఎస్ కాలువలో శనివారం ఈతకు దిగిన ఇద్దరు యువకులు గల్లంతై ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీరని రోదన మిగిలింది.

గత కొన్నేళ్లుగా ఇదే తంతు.. సేఫ్టీ ఎక్కడ?

ఇది మొదటిసారి కాదు. గత కొన్ని సంవత్సరాలుగా కేటీపీఎస్ పవర్ ప్లాంట్ కాలువలో ఇదే తరహాలో అనేకమంది యువత, అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు సమస్య ఏమిటంటే.. కాలువ వద్ద కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమేనని విమర్శలు వస్తున్నాయి.?కాలువకు ఇరువైపులా కనీసం ఇనుప కంచె (ఫెన్సింగ్) లేదా సేఫ్టీ వాల్ లేకపోవడం ?లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం.?నీరు ఉధృతంగా ప్రవహించేటప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే వ్యవస్థ లేకపోవడం.?ప్రమాదకరమైన ఈ కాలువ పక్కనే జనావాసాలు, పొలాలు, పిల్లలు ఆడుకునే ప్రదేశాలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజల డిమాండ్లు: ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేటీపీఎస్ అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.?మృతుల కుటుంబాలకు ప్రభుత్వం/యాజమాన్యం తక్షణమే నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని బాధ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కేటీపీఎస్ కాలువ వెంబడి ప్రమాదకర ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో ఇనుప కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేయాలి.?ప్రతి 100 మీటర్లకు ఒక హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ చేపట్టాలని.ఇకపై ఇలాంటి ప్రాణనష్టాలు పునరావృతం కాకుండా శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలి.ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ నిర్లక్ష్యానికి ఇప్పటికైనా తెరపడుతుందా? లేక మరిన్ని కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోవాల్సిందేనా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల తరపున బాధితులకు న్యాయం జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కమ్మ జనసేవా సమితి ఆధ్వర్యంలో విజయవంతమైన
ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం
– తండోపతండాలుగా పరీక్షలు చేయించుకున్న స్త్రీ పురుషులు



వైరా, అక్టోబర్ 17, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ కమ్మవారి కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన కమ్మ జనసేవ సమితి కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బసవతారకం ఎండో అమెరికన్ క్యాన్సర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ గూడూరు సత్యనారాయణ, కమ్మ జనసేవా సమితి అధ్యక్షులు కట్టా కృష్ణార్జునరావు లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంత ప్రజలకు పెరుగైన వైద్యం అందించేందుకు, బసవతారక ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వారు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, క్యాన్సర్ ను ప్రాథమిక దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో , ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, స్థానిక ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని, ఉచిత వైద్య శిబిరానికి వందలాది మంది ప్రజలు హాజరై వైద్య సికిత్సలు పొందారని, క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా చికిత్స మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఉంటుందని, శరీరంలో అసాధారణ మార్పులు కనిపించినప్పుడు వైద్యులను సంప్రదించాలని, క్యాన్సర్ పై అవగాహన పెంపొందించడంతోపాటు, వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఉద్దేశంతో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం జరుగుతుందని, ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు, దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ జనసేవా సమితి అధ్యక్షులు కట్టా కృష్ణార్జున రావు, మాజీ ఎమ్మెల్యే కొండపల్లి కోటేశ్వరరావు, వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ , కమ్మ జన సేవా సమితి సభ్యులు చెంతినిపు రాంబాబు, మెదరమెట్ల శ్రీనివాసరావు, చావా శ్రీనివాసరావు, సూర్యదేవర శ్రీధర్, వాసిరెడ్డి రమేష్, ఏనుగు హనుమంతరావు, వైరా ఎస్సై పుష్పాల రామారావు, వైద్య సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

పి ఆర్ టి యు రాష్ట్ర కమిటీ ఎన్నిక
- రాష్ట్ర కార్యదర్శిగా నిమ్మ తోట జాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాటి రామచంద్రయ్య



వైరా, అక్టోబర్ 17,(భద్రాద్రి న్యూస్) : నల్లగొండలో జరిగిన పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వైరా మండలం గొల్లపూడి పాఠశాలలో పనిచేస్తున్న నిమ్మ తోట జాన్ రాష్ట్ర కార్యదర్శిగా, తాటిపూడి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న పాటి రామచంద్రయ్య పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వైరా మండల అధ్యక్షులు వెలిసేట్టి నరసింహారావు మాట్లాడుతూ పాటి రామచంద్రయ్య వైరా మండల శాఖకు రెండు దశాబ్దాలకు పైగా మండల ప్రధాన కార్యదర్శిగా, 8 సంవత్సరాలు జిల్లా కార్యదర్శిగా పనిచేశారని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావటం సంతోషకరమైన పరిణామం అని పి ఆర్ టి యు సంఘవిదేవుడిగా ఉంటూ సంఘ బలోపేతానికి కృషిచేస్తూ, నేడు పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక కావడం నిజంగా సుపరిణాము అని తెలిపారు. వైరా మండల ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నిమ్మ తోట జాన్ ఉద్యోగంలో నియామకమైనప్పటినుండి పి ఆర్ టి యు సంఘ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ ఉంటున్నారని, సంఘ బలోపేతానికి అహర్నిశలు శ్రమించే వ్యక్తి అని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎవరున్న వారికి సహకరిస్తూ,వారిని గౌరవిస్తూ, సంగం చేపట్టే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ఈ రోజున పిఆర్టియు రాష్ట్ర అత్యున్నత కార్యవర్గంలో రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక కావడం నిజంగా శుభ పరిణామం అని తెలిపారు. ఈ సందర్భంగా పిఆర్టియు జిల్లా కార్యవర్గ సభ్యులు జి. సుజాత, జి భారతి, కారు మంచి దయాకర్ రావు, పి ఆర్ టి యు సీనియర్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, చిలుకూరి ఐజాక్, గూడపాటి శ్రీనివాసరావు, సూర్యదేవర సురేష్, ముజీబ్, శ్రీనివాస్ రెడ్డి, యాకూబ్, మండల కార్యవర్గ సభ్యులు పి.లత, నాగబత్తిని స్వప్న, అహల్య, ఎస్. సరస్వతి , జి. గృహలక్ష్మి, జి. పద్మావతి, ఎన్. నాగమణి , అమరలపూడి రవికుమార్, అనుములు రాఘవరావు, తిరుమలయ్య, ఎం. దయాకర్, జి. రమేష్, బి. నాగరాజు, బి.పుల్లారావు, ఎం. ప్రభాకర్, హరిబాబు, రాగి, సురేష్, నజీర్, కిషన్, యాదగిరి, తాలూరి రవి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

దుర్గాదేవి మండపం వద్ద
ఘనంగా కుంకుమ పూజ
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు



గుండాల, అక్టోబర్ 17 భద్రాద్రి న్యూస్ : దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గాదేవి మండపం వద్ద కుంకుమ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడంతో మండపం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మహిళల కోసం సామూహిక కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని, గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండటంతో భక్తుల్లో భక్తిభావం వెల్లివిరుస్తోంది. కుంకుమ పూజలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. భక్తులతో దుర్గాదేవి మండపం సందడిగా మారింది.

కారేపల్లికి సీతారామ జలాలు ఎప్పుడు?
రైతులకు న్యాయం ఏది?

- కారేపల్లి, కామేపల్లి మండలాలకు సాగునీరు అందించాలి..

- కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి: సీపీఐ(ఎం) డిమాండ్



వైరా, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్): సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములిచ్చిన ప్రాంతాలకే సాగునీరు అందకపోవడం విచారకరమని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. కారేపల్లి, కామేపల్లి, ఏన్కూరు మండలాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని, కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం వైరాలోని బోడేపూడి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భూక్యా వీరభద్రంతో పాటు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, సీపీఐ(ఎం) కొణిజర్ల మండల కార్యదర్శి చెరుకుపల్లి కుటుంబరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏన్కూరు, కొణిజర్ల, వైరా మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం అందించాలని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని స్పష్టం చేశారు.

గిరిజన రైతులకు రుణమాఫీ చేయాలి

ఏన్కూరు మండలం మూలపోచారం పంచాయతీ పరిధిలో పోడు భూముల హక్కు పత్రాలు కలిగిన గిరిజన రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సాగునీటి సౌకర్యాలు కల్పిస్తేనే వ్యవసాయం అభివృద్ధి చెంది రైతుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో వివక్ష వద్దు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయ వివక్షకు తావులేకుండా అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని నాయకులు కోరారు. ఇళ్లు లేని పేదలను గుర్తించి పారదర్శకంగా ఇళ్లు కేటాయించాలని సూచించారు. గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఏన్కూరు మండలంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు హాజరవుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత మంత్రులు వైరా నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సీతారామ ప్రాజెక్టు సాగునీరు, కరువు సహాయక చర్యలు, గిరిజన రైతుల రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, గ్రామీణాభివృద్ధికి నిధుల విడుదలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు.

కాయకల్ప అవార్డుల్లో జిల్లాకు వంద శాతం విజయం

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాయకల్ప కార్యక్రమంలో పాల్గొన్న ఐదు తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఆసుపత్రులూ అవార్డులు సాధించి వంద శాతం విజయాన్ని నమోదు చేయడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు . శనివారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం కలెక్టర్ ఛాంబర్ నందు కాయకల్ప్ అవార్డులు సాధించిన ఆసుపత్రుల బృందాలను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... పాత భవనాలు, మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఎదురయ్యే అనేక సవాళ్లను అధిగమిస్తూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, ఆసుపత్రుల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పేద, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, పారిశుద్ధ్య సిబ్బంది సమష్టి కృషి, అంకితభావం ఈ విజయానికి కారణమని తెలిపారు

బేతంపూడిలో ఘనంగా ఉచిత కంటి వైద్య శిబిరం

– డాక్టర్ అగర్వాల్ కంటి హాస్పిటల్ వైద్యుల బృందం సహకారంతో

– బేతంపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ శ్రీకాంత్



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సుజాతనగర్ మండలంలోని బేతంపూడి గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ వాంకుడోత్ శ్రీకాంత్ సహకారంతో, రాజ్ మొహమ్మద్ జూన్ బి మెమోరియల్ ట్రస్ట్ (రుద్రంపూర్) ఆధ్వర్యంలో స్థానిక గ్రామ ప్రజల కోసం “ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఖమ్మం మరియు హైదరాబాద్‌లకు చెందిన ప్రముఖ డాక్టర్ అగర్వాల్ కంటి హాస్పిటల్ వైద్యుల బృందం సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించి, ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్ మొహమ్మద్ జూన్ బి మెమోరియల్ ట్రస్ట్ అధినేత, ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎండి. రజాక్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ గారు అతిడులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. గ్రామ ప్రజలకు ఈ సేవలను చేరువ చేయడంలో సర్పంచ్ శ్రీకాంత్ కృషిని, అలాగే అగర్వాల్ ఆసుపత్రి వైద్యుల సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొని ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు.

పత్తి పంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



చంద్రుగొండ/జూలూరుపాడు(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి: మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన రైతు మాలోత్ రమేష్ సాగు చేస్తున్న మూడు ఎకరాల పత్తి పంటను వ్యవసాయ శాస్త్రవేత్త డా. టి. భరత్, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు శనివారం పరిశీలించారు. పంట ఎదుగుదల, పూత, కాయల ఏర్పాటులో సమస్యలను గుర్తించి, నేల పరిస్థితులను అధ్యయనం చేశారు. పంట సమస్యలకు విత్తనాల నాణ్యత కారణమా, యాజమాన్య పద్ధతుల్లో లోపాలా అనే అంశాలపై శాస్త్రీయంగా పరిశీలించి నివేదిక అందిస్తామని తెలిపారు. రైతులు పంటల్లో సమస్యలు గుర్తించిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి సలహాలు పొందాలని సూచించారు.

స్కానింగ్ సెంటర్లలో నిబంధనలు తప్పనిసరి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్) : జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ సూచించారు. పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో డిస్ట్రిక్ట్ లెవల్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లు, చట్ట నిబంధనల అమలు, రికార్డుల నిర్వహణ, పర్యవేక్షణ తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లను ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా తనిఖీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్కానింగ్ సెంటర్లు నిబంధనలకు అనుగుణంగా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు, లింగ ఎంపికకు సంబంధించిన చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు కఠినమైన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. అబార్షన్ రేట్లను తగ్గించేందుకు, ఆడ శిశువుల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు గైనకాలజిస్ట్ డాక్టర్ సాగరిక, రేడియాలజిస్ట్ డాక్టర్ జ్యోతి, ఎన్‌జీఓ ప్రతినిధి డాక్టర్ పోరా, పీడియాట్రిషియన్ డాక్టర్ రాకేష్, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాచారం సభకు సింగరేణి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలి!

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనను విజయవంతం చేయాలి..

సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్ పిలుపు



కారేపల్లి, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్ రాములు): తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదివారం (అక్టోబర్ 18) ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం నాచారం గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో సింగరేణి మండలంలోని సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ పిలుపునిచ్చారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు నాచారంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని, అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. ఉదయం 11.30 గంటలకు జరిగే సమావేశంతో పాటు వైరా నియోజకవర్గ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్లు, మండల నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు సమయానికి నాచారం చేరుకోవాలని రంజిత్ కుమార్ కోరారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో వ్యవహరిస్తూ, పెద్ద సంఖ్యలో పాల్గొని ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గేట్ కారేపల్లిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు!

- సర్పంచ్ పూసం ఎల్లయ్య ఆధ్వర్యంలో వేడుకలు..

సంప్రదాయబద్ధంగా పాల్గొన్న గ్రామ మహిళలు



కారేపల్లి, అక్టోబర్ 16 (భద్రాద్రి న్యూస్ రాములు): కారేపల్లి మండలం గేట్ కారేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో గ్రామ మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళల భాగస్వామ్యంతో వేడుకలు సంప్రదాయబద్ధంగా సాగాయి. ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూసం ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి కె. అనూష, ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసరావు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బొర్రా అచ్చయ్యకు కాంగ్రెస్ నేతల అశ్రునివాళి

- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాలతో

దశదినకర్మకు హాజరైన గుడిపూడి తిరుమలరావు



కారేపల్లి, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్ రాములు): కారేపల్లి మండలం రొట్టమాకిరేవు గ్రామానికి చెందిన బొర్రా అచ్చయ్య దశదినకర్మ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమలరావు పాల్గొని నివాళులర్పించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు కార్యక్రమానికి హాజరైన ఆయన, అచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అచ్చయ్య కుమారుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొర్రా స్వామిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచిస్తూ, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు అడ్డగోడ ఐలయ్య, రేగులగూడెం సర్పంచ్ ఈసం మోతి వీరస్వామి, ఉపసర్పంచ్ సత్యనారాయణ, నూకల మోహన్‌రావు, వార్డు సభ్యుడు ఇరప నరసింహారావు, గ్రామ పెద్దలు ఇరప బక్కయ్య, చెవుల భద్రయ్య, మద్దబోయిన కోటయ్య, వెంకట నరసయ్య, పాపారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొని అచ్చయ్యకు నివాళులర్పించారు.

దుర్గామాత ఆశీస్సులు అందరి పై ఉండాలి

- సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె షాబీర్ పాషా,

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్) : శ్రీ శ్రీ కనకదుర్గమ్మ వారి ఆశీస్సులు దేశ ప్రజలందరిపై ఉండాలని, ఎల్ ని నో ప్రభావం నుండి వచ్చే విపత్తుల నుండి దేశ ప్రజలను కాపాడాలని, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అమ్మవారిని వేడుకున్నారు. రామవరం ఏఐటియుసి ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్కే షాబీర్ పాషా, మూడ్ గణేష్ లు మాట్లాడుతూ... గత 29 సంవత్సరాల నుండి సుదీర్ఘకాలంగా రామవరం ఆటో స్టాండ్ ఏఐటియుసి ఆధ్వర్యంలో కులాలకు, మతాలకు అతీతంగా నవరాత్రులు నిర్వహించడం అభినందనీయమని వారు కొనియాడారు. మీరు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి, ఏఐటియుసీ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ, 18వ డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హిమశ్రీ, రామవరం బ్రాంచ్ కార్యదర్శి గోపికృష్ణ, పాటి మోహన్రావు, ఎం రాజేష్,కృష్ణ, కోటేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమీ గౌడ్‌కు ఘన సన్మానం.. అభినందించిన అజ్మీరా వీరన్న

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియామకంపై హర్షం..

- ప్రజాసేవను మరింత విస్తరించాలని ఆకాంక్ష



కారేపల్లి, అక్టోబర్ 16 (భద్రాద్రి న్యూస్ రాములు): మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలానికి చెందిన సమీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సమీ గౌడ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా సింగరేణి మండల మాజీ టీఆర్ఎస్ కార్యదర్శి అజ్మీరా వీరన్న ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అజ్మీరా వీరన్న మాట్లాడుతూ, సమీ గౌడ్ చిన్నతనం నుంచే పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కొత్త బాధ్యతలు చేపట్టిన సమీ గౌడ్ ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు విశేష సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన జనసత్తా వైరా నియోజకవర్గ ఆర్సీ ఇన్‌చార్జి భూక్యా రాంకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి బతుకమ్మ సంబరాలకు సర్పంచ్ టోనీ భారీ ఏర్పాట్లు!

- పెద్ద చెరువు ప్రాంగణం విద్యుత్ దీపాలతో అలంకరణ..

ఆడపడుచులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సదుపాయాలు



కారేపల్లి, అక్టోబర్ 16 (భద్రాద్రి న్యూస్ రాములు): కారేపల్లిలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు సింగరేణి గ్రామపంచాయతీ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద చెరువు ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తూ, బతుకమ్మ ఆడేందుకు వచ్చే ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించారు. పండుగకు వచ్చే మహిళలు, కుటుంబ సభ్యులు ఆహ్లాదకర వాతావరణంలో వేడుకల్లో పాల్గొనేలా ప్రాంగణంలో పరిశుభ్రత, భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కారేపల్లిలో ఉత్సాహంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆడపడుచుల ఆనందమే లక్ష్యంగా చేపడుతున్న ఈ ఏర్పాట్లతో పెద్ద చెరువు ప్రాంగణం బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
ఆదివారం
18 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం



పిట్టలదొర వేషంలో సామాజిక చైతన్యం కల్పిస్తున్న రాచకొండ ప్రభాకర్

వైరా, అక్టోబర్ 17,(భద్రాద్రి న్యూస్) : సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ సాధారణంగా వినోదాన్ని పంచే పెట్రోల్ ధర వేషధారణకు సామాజిక సామాజిక బాధ్యతను జోడించి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని వాటి వల్ల కలిగే సామాజిక, ఆర్థిక, మానసిక,శారీరక, అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని, సందేశం ఇస్తున్నారు అదే సమయంలో రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, ఫోర్ వీలర్స్ నడిపేవారు కంపల్సరిగా సీట్ బెల్ట్ ధరించాలని, వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ రూల్స్, నిబంధనలను పాటించాలని, అందరినీ నవ్విస్తూనే ఆలోచన చేస్తూ సాధారణంగా పిట్టలదొర దసరా పండుగ సందర్భంగా గ్రామాల్లో తన మాటల్లో గారడీతో, నవ్వులు పూజిస్తూ ఎంతో కొంత యాచన చేస్తాడు కానీ ఇక్కడ మాత్రం, డ్రగ్స్ గంజాయి నివారణ, రోడ్డు భద్రత ఆలోచించే విధంగా శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో గల, కొత్త బస్టాండ్ పరిసర ప్రాంతాలలో గంజాయి, డ్రగ్స్, రోడ్డు భద్ర సందేశం, వినోదాత్మక వేషధారణతో ప్రజలను ఆకట్టుకుంటూ, సామాజిక సమస్యలను వారి దృష్టికి తీసుకువెళటమే ఈ ప్రయత్నంలోనే ప్రత్యేకత, మాటల్లో హాస్యం ఉన్న సందేశాలతో సామాజిక బాధ్యత కనిపిస్తుంది, యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఈ ప్రచారం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం, అలానే మరుగున పడుతున్న జానపద కళలను కూడా వెలుగు తీయడం తన వంతు బాధ్యతగా భావిస్తున్నాను అని అన్నారు.



విరామ బైబిలు పాఠశాల విజయవంతం

- అధిక సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 17 (భద్రాద్రి న్యూస్) : దసరా సెలవులను పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం పట్టణంలో ఉన్న బెతనియ ప్రార్థన మందిరంలో "విరామ బైబిల్ పాఠశాల - (వీబీఎస్-2026) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు దైవ సేవకుడు పురుషోత్తం తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 12వ తేదీ నుండి 17వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8:30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విరామ బైబిల్ పాఠశాలలో చిన్నపిల్లలు, యువత కోసం ప్రత్యేకంగా బైబిల్ కథలు, డ్రాయింగ్స్, కలర్స్, క్రొత్త పాటలు, చక్కటి పటములతో ఆధ్యాత్మిక బోధనలు నిర్వహించామని చెప్పారు. పిల్లలలో దేవుని వాక్యంపై ఆసక్తి పెంపొందించేలా వివిధ సృజనాత్మక కార్యక్రమాలు ఏర్పాటు చేసామని వెల్లడించారు. గత 6 రోజులుగా నిర్విరామంగా కొనసాగిన విరామ బైబిలు పాఠశాల శనివారం ఘనంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. "క్రీస్తు యేసు మంచి రాణువ వాడు" అనే అంశం పైన, అదేవిధంగా విద్యార్థుల చేత కంఠస్థ వాక్యాలు మరియు సాక్షాలు చెప్పే విధంగా వారికి ప్రోత్సాహం అందించామని తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలోబెతనియ పార్థన మందిరము సంఘ పెద్దలు, సహాయకులు, జిల్లాలోని ఇతర దైవ సేవకులు, జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన విధ్యర్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చేరిన ఎల్.కె. అద్వానీ



ఛాతీ ఇన్ఫెక్షన్‌తో ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చేరిక
వైద్యుల పర్యవేక్షణలో చికిత్స
ఐసీయూలో నిశిత పరిశీలన
ఆరోగ్యం స్థిరంగా ఉందని వెల్లడించిన వైద్యులు

న్యఢిల్లీ, అక్టోబర్ 17

భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత,మాజీకేంద్ర మంత్రి ఎల్.కె.అద్వానీ ఆస్పత్రిలో చేరారు. ఛాతీ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయనను ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అద్వానీ ఆస్పత్రిలో చేరిన నేపథ్యంలో ఆయన ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను వైద్య బృందం ఆరోగ్య ప్రకటన ద్వారా వెల్లడించింది. ప్రస్తుతం ఆయనకు అవసరమైన వైద్య సేవలు దిస్తున్నట్లు తెలిపింది.

సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ వినీత్ రి ఆధ్వర్యంలోని వైద్య బృందం అద్వానీకి చికిత్స అందిస్తోంది. ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షి ,అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఛాతీ ఇన్ఫెక్షన్‌కు బంధించిన సమస్యలను దృష్టిలో చుకుని వైద్యులు చికిత్స కొనసాగిస్తున్నారు. ఆయనకు అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితిలో చోటుచేసుకునే మార్పులను వైద్య బృందం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది.

ప్రస్తుతం ఎల్.కె. అద్వానీ ఆరోగ్యంగా ఉందని వైద్యులు వెల్లడించారు. అయినప్పటికీ ఆయనను ఐసీయూలో ఉంచి నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్య సేవలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. వయోభారం, ప్రస్తుత అనారోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్యానికి సంబంధించిన తాజా వివరాలను వైద్యుల ప్రకటన ద్వారా తెలియజేశారు.

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడిగా ఎల్.కె. అద్వానీ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. మాజీ కేంద్ర మంత్రిగా కూడా ఆయన సేవలందించారు. ఆయన ఆస్పత్రిలో చేరిన విషయం వెలుగులోకి రావడంతో ఆరోగ్య పరిస్థితిపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించినట్లు సమాచారం. ఆయనకు అందుతున్న వైద్య సేవలపై వైద్య బృందం నిరంతరం దృష్టి సారిస్తోంది.ఎల్.కె. అద్వానీ ఆరోగ్యానికి సంబంధించి ఆస్పత్రి విడుదల చేసిన ప్రకటనలో ఆయన పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఛాతీ ఇన్ఫెక్షన్‌కు చికిత్స అందిస్తూ ఐసీయూలో నిశిత పరిశీలన కొనసాగిస్తున్నారు. డాక్టర్ వినీత్ సూరి ఆధ్వర్యంలోని వైద్య బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. తదుపరి వైద్యపరమైన వివరాలు అందుబాటులోకి వచ్చినప్పుడు ఆయన ఆరోగ్య పరిస్థితిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

భారతీయ ఉద్యోగులపై అమెరికా నిబంధనల ప్రభావం

- **హెచ్-4 వీసాదారులకు ఆటోమేటిక్ పొడిగింపు రద్దు**
- **ఉద్యోగ అనుమతి పత్రం గడువు ముగిస్తే పనిచేయలేని పరిస్థితి**
- **భారతీయ కుటుంబాల ఆర్థిక భద్రతపై ఆందోళన**
- **పునరుద్ధరణ దరఖాస్తులను ముందుగానే చేసుకోవాలని సూచన**



న్యూఢిల్లీ, అక్టోబర్ 17

: అమెరికా ప్రభుత్వం ఉద్యోగ అనుమతి పత్రాల పునరుద్ధరణకు సంబంధించిన నిబంధనల్లో కీలక మార్పు తీసుకొచ్చింది. ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ (ఈఏడీ) గడువు ముగిసినప్పటికీ, పునరుద్ధరణ దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నవారికి గతంలో కల్పించిన గరిష్ఠంగా 540 రోజుల స్వయంచాలక పొడిగింపు సౌకర్యాన్ని రద్దు చేస్తూ తుది నిబంధనను జారీ చేసింది. అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం అక్టోబర్ 14, 2026న ఈ నిబంధనను ఖరారు చేసింది. 2025 అక్టోబర్ 30న తీసుకొచ్చిన తాత్కాలిక నిర్ణయాన్నే ఇప్పుడు తుది నిబంధనగా అమలు చేస్తోంది. గతంలో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం కారణంగా ఉద్యోగ అనుమతి పత్రాల గడువు ముగిసినా, అర్హులైన దరఖాస్తుదారులు నిర్దిష్ట కాలం పాటు ఉద్యోగాలు కొనసాగించేందుకు అవకాశం ఉండేది. తాజా మార్పుతో ఆ వెసులుబాటు గణనీయంగా తగ్గింది.

ఈ నిర్ణయం ముఖ్యంగా హెచ్ 1బీ వీసాలపై అమెరికాలో పనిచేస్తున్న భారతీయ నిపుణుల జీవిత భాగస్వాములైన హెచ్ 4 వీసాదారులపై ప్రభావం చూపనుంది. హెచ్ 4 వీసాపై ఉన్న కొందరు జీవిత భాగస్వాములు ఉద్యోగాలు చేసేందుకు ఈఏడీ తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. అలాంటి వారు పునరుద్ధరణ కోసం గడువులోగా దరఖాస్తు చేసినప్పటికీ, పాత అనుమతి పత్రం గడువు ముగిసేలోపు కొత్త పత్రం రాకపోతే ఉద్యోగానికి తాత్కాలికంగా దూరం కావాల్సి రావచ్చు. అక్టోబర్ 30, 2025న లేదా ఆ తర్వాత దాఖలు చేసిన అర్హతగల పునరుద్ధరణ దరఖాస్తులకు సాధారణంగా 540 రోజుల స్వయంచాలక పొడిగింపు వర్తించదు. అయితే, గతంలోనే అర్హత మేరకు పొందిన పొడిగింపులను ఈ నిబంధన వెనక్కి తీసుకోదు. చట్టం లేదా ప్రత్యేక ప్రభుత్వ ప్రకటనల ద్వారా కల్పించే కొన్ని మినహాయింపులు కూడా కొనసాగవచ్చు.కొత్త నిబంధనతో అమెరికాలో పనిచేస్తున్న భారతీయ కుటుంబాల్లో ఉద్యోగ భద్రత, ఆదాయ స్థిరత్వంపై ఆందోళనలు పెరుగుతున్నాయి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ కుటుంబ ఖర్చులు, ఇంటి అద్దె, పిల్లల చదువులు, ఇతర అవసరాలను నిర్వహిస్తున్న కుటుంబాల్లో ఒకరి ఉద్యోగానికి విరామం ఏర్పడితే ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా కొత్త ఉద్యోగ అనుమతి పత్రం కోసం ఎక్కువకాలం వేచి చూడాల్సి వస్తే ఆదాయం నిలిచిపోవడమే కాకుండా, తిరిగి ఉద్యోగంలో చేరే విషయంలోనూ సమస్యలు ఎదురుకావచ్చు. ఉద్యోగ అనుమతి గడువు ముగిసిన తర్వాత కూడా పని కొనసాగించడం చట్టపరమైన సమస్యలకు దారితీయవచ్చు కాబట్టి, సంబంధిత నిబంధనలను ముందుగానే తెలుసుకోవడం అవసరం. ఈ మార్పు ప్రభావం వ్యక్తుల వీసా వర్గం, ఉద్యోగ అనుమతి అర్హత, దరఖాస్తు తేదీ, వర్తించే మినహాయింపులపై ఆధారపడి ఉంటుంది.అయితే, ఎఫ్1 విద్యార్థి వీసాపై చదువుతున్న వారిలో అర్హతగల విజ్ఞాన, సాంకేతిక, ఇంజినీరింగ్, గణితశాస్త్ర విభాగాల విద్యార్థులకు వర్తించే ఐచ్ఛిక ప్రాయోగిక శిక్షణ పొడిగింపుపై ఈ నిర్ణయం ప్రభావం చూపదని సంబంధిత వార్తా కథనాలు పేర్కొన్నాయి. అలాగే ఎల్2, ఈ వీసాలపై ఉన్న అర్హతగల జీవిత భాగలు తమ వలస హోదా ఆధారంగా ఉద్యోగం చేసేందుకు అనుమతి పొందే పరిధి వేరుగా ఉంటాయి. అందువల్ల ప్రతి వీసా వర్గానికి ఒకే నిబంధన వర్తిస్తుందని భావించకూడదు. తమ ఉద్యోగ అనుమతి పత్రం వర్గానికి చెందింది, దాని గడువు ఎప్పుడు ముగుస్తుంది, పునరుద్ధరణ దరఖాస్తు ఎప్పుడు దాఖలైంది, తమకు ఏవైనా మినహాయింపులు వర్తిస్తాయా అనే అంశాలను సంబంధిత అధికారిక మార్గదర్శకాల ఆధారంగా పరిశీలించుకోవాలి.ఈ నేపథ్యంలో ఈఏడీ పునరుద్ధరణ అవసరమైనవారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత ముందు దరఖాస్తు చేసుకోవాలని వలస నిపుణులు సూచిస్తున్నారు. ఆరు నుంచి ఎనిమిది నెలల ముందుగా ప్రక్రియను ప్రారంభించే అవకాశాన్ని పరిశీలించడం, దరఖాస్తు రసీదు, అనుమతి పత్రాల గడువులు, ఉద్యోగ సంబంధించిన ఆధారాలను భద్రపరచడం ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ముందుగా దరఖాస్తు చేసినంత మాత్రాన కొత్త అనుమతి పత్రం సకాలంలో వస్తుందనే హామీ ఉండదు. కాబట్టి ఉద్యోగదాతలు ముందుగానే సంప్రదింపులు జరపడం అవసరమైతే అర్హతగల వలస న్యాయ నిపుణుల సలహా తీసుకోవడం ముఖ్యం. అమెరికాలో స్థిరపడిన భారతీయ కుటుంబాలకు ఈ నిబంధన మార్పు ఉద్యోగ ప్రణాళికలు, కుటుంబ ఆదాయం, భవిష్యత్తు నిర్ణయాలపై ప్రభావం చూపే అవకాశం ఉండటం అధికారిక మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు పరిశీలించడం అవసరం.

భారత నౌకాదళంలోకి ఐఎన్ఎస్ సమర్థక్



ఎల్ అండ్ టీ నౌకా నిర్మాణశాలలో రూపకల్పన
ప్రైవేటు రంగ నౌకా నిర్మాణానికి కీలక మైలురాయి

న్యఢిల్లీ, అక్టోబర్ 17

భారత నౌకాదళంలోకి ఐఎన్ఎస్ సమర్థక్ అనే బహుళ ప్రయోజన నౌక అక్టోబర్ 16, 2026న కారికంగా చేరింది. దేశ రక్షణ గంలో స్వదేశీ నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ పరిణామం కీలక మైలురాయిగా నిలిచింది. భారత నౌకాదళ అవసరాలకు అనుగుగా రూపొందించిన ఈ నౌకను సేవకి ప్రవేశపెట్టడం ద్వారా దేశీయంగా ఆధునిక నౌకలను నిర్మించే సామర్థ్యానికి మరింత గుర్తింపు లభించింది. సముద్ర రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞా , నిర్మాణ నైపుణ్యాన్ని పెంపొందిం కోవాలనే లక్ష్యానికి ఈ నౌక చేరిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

ఐఎన్ఎస్ సమర్థక్‌ను ఎల్ అండ్ టీ నౌకా నిర్మాణశాల రూపకల్పన చేసి ర్మించింది. భారతదేశంలోని ప్రైవేటు నౌకా నిర్మాణశాలలో నిర్మించిన తొలి ప్రధాన యుద్ధనౌకగా ఇది ప్రత్యేకతను తరించుకుందని అధికారిక ప్రకటన పేర్కొంది. దేశీయ ప్రైవేటు రంగంలో నౌకా నిర్మాణ సామర్థ్యం పెరుగుతోందనే విషయానికి ఈ నౌక నిర్మాణం నిదర్శనంగా నిలుస్తోంది. ఆధునిక నౌకల రూపకల్పన, నిర్మాణం వంటి కీలక రంగాల్లో భారతీయ సంస్థలు సాధిస్తున్న పురోగతిని ఈ పరిణామం ప్రతిబింబిస్తోంది. రక్షణ రంగానికి అవసరమైన నౌకలను స్వదేశీ సంస్థల సహకారంతో నిర్మించుకోవడంలో ఇది ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

బహుళ ప్రయోజన నౌకగా రూపొందించిన ఐఎన్ఎస్ సమర్థక్ భారత నౌకాదళంలో చేరడంతో దేశీయ నౌకా నిర్మాణ పరిశ్రమకు మరింత ప్రోత్సాహం లభించనుంది. నౌకను నిర్మించిన సంస్థకు, దాని నిర్మాణంలో భాగస్వాములైన సాంకేతిక నిపుణులకు ఇది ఒక ముఖ్యమైన విజయంగా నిలిచింది. ప్రైవేటు నౌకా నిర్మాణ రంగం ఆధునిక అవసరాలకు అనుగుణంగా పెద్ద నౌకలను నిర్మించే స్థాయికి ఎదుగుతోందని ఈ కార్యక్రమం తెలియజేస్తోంది. దేశ రక్షణ అవసరాలకు అనుగుణంగా నౌకల రూపకల్పన, నిర్మాణంలో స్వదేశీ సంస్థల భాగస్వామ్యం పెరగడం ద్వారా ఈ రంగంలో మరిన్ని అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది.

మృతి చెందిందని అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా మేల్కొన్న మహిళ

- **నోట్లో తులసి నీరు పోస్తుండగా దగ్గిన మహిళ**
- **ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు**
- **ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్‌లో ఆశ్చర్యకర ఘటన**



గోరఖ్‌పూర్, అక్టోబర్ 17

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోరఖ్‌పూర్ జిల్లాలో ఆశ్చర్యకర ఘటన వెలుగులోకి వచ్చింది. చనిపోయిందని భావించి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో ఓ మహిళ దగ్గుతూ మేల్కొనడంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా విస్మయానికి గురయ్యారు. గోరఖ్‌పూర్ పరిధిలోని బెలావా డాఖిలీ గ్రామానికి చెందిన లలితా దేవి అనారోగ్యానికి గురికావడంతో ఆమె భర్త శివమురాత్ యాదవ్ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు ఆమెకు చికిత్స అందించారు. అయితే చికిత్స అనంతరం లలితా దేవి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు భావించారు. దీంతో ఆమెను ఇంటికి తీసుకెళ్లారు.

లలితా దేవి మరణించినట్లు భావించిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇంట్లో బంధువులు, కుటుంబ సభ్యులు చేరడంతో విషాద వాతావరణం నెలకొంది. అంత్యక్రియలకు సంబంధించిన సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో లలితా దేవి నోట్లో తులసి నీరు పోసే ప్రయత్నం చేశారు. అప్పటివరకు కదలికలు లేవని భావించిన ఆమె ఒక్కసారిగా దగ్గడం ప్రారంభించింది. దీంతో అక్కడ ఉన్న కుటుంబ సభ్యులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆమె శరీరంలో కదలికలు కనిపించడంతో చనిపోయిందని భావించిన మహిళ ఇంకా బతికే ఉందని గుర్తించారు.

అంత్యక్రియలకు సిద్ధమవుతున్న సమయంలో లలితా దేవి దగ్గడం కుటుంబ సభ్యుల్లో కొత్త ఆశను కలిగించింది. పరిస్థితిని గమనించిన వారు ఆలస్యం చేయకుండా ఆమెను ఆస్పత్రికి తరలించాలని నిర్ణయించుకున్నారు. వెంటనే గోరఖ్‌పూర్‌లోని వైద్యకళాశాలకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. అప్పటివరకు మరణించిందని భావించిన మహిళలో కదలికలు కనిపించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో పాటు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆమె ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు వైద్య సహాయం పొందడంపై దృష్టి సారించారు.

లలితా దేవిని గోరఖ్‌పూర్ వైద్య కళాశాలకు తరలించినట్లు అందిన సమాచారం తెలుస్తోంది. అక్కడ ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించేందుకు కుటుంబ సభ్యులు చర్యలు చేపట్టారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు వెల్లడించిన తాజా వివరాలు అందుబాటులో ఉన్న సమాచారం రాలేదు. తొలుత ఆస్పత్రిలో మృతి చెందినట్లు నిర్ధారించారని కుటుంబ సభ్యులు భావించడం, అనంతరం ఇంట్లో దగ్గడం ప్రారంభించడంతో ఆమెను మరోసారి ఆస్పత్రికి తీసుకెళ్లడం ఈ ఘటనలో కీలక పరిణామాలుగా నిలిచాయి.

బెలావా డాఖిలీ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన లలితా దేవి మరణించిందని భావించిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు సిద్ధమవుతుండగా, తులసి నీరు పోసే సమయంలో ఆమె దగ్గడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. వెంటనే ఆమెను గోరఖ్‌పూర్ వైద్య కళాశాలకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వైద్యపరమైన పూర్తి వివరాలు, మహిళ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి తెలియాల్సి ఉంది.